క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ పార్టీ బూత్‌ కమిటీ సమావేశం



సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ సునీత

గౌతంనగర్‌: నగరంలోని ఎస్వీఆర్‌హిల్స్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ బూత్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో గౌతంనగర్‌ కార్పొరేటర్‌ మేకల సునీతారాముయాదవ్‌ హాజరయయ్యారు. జూబ్లీహిల్స్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మాగంటి సునీత గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



బోడుప్పల్‌: చెంగిచర్ల ద్వారకానగర్‌ ఫేస్‌–2లోని అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి 1వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ బింగి జంగయ్యాయాదవ్‌ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమకు తోచిన సాయం అందజేయాలని కోరారు. బీఆర్‌ఎస్‌ యువ నేతలు బింగి యోగేష్‌యాదవ్‌, కాలనీ అధ్యక్షుడు రాజుగౌడ్‌, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమాజ హితానికి సన్మార్గంలో నడవాలి



పాస్టర్స్‌డే వేడుకల్లో గంగరాజు

బోడుప్పల్‌: సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని జేజీఆర్‌ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్‌ గంగరాజు అన్నారు. బోడుప్పల్‌ జిప్సి చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన పాస్టర్స్‌ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏసుక్రీస్తు బోధనలను మానవహితం కోసం ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పాస్టర్లు పన్నీర్‌ సెల్వం, మనీష్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి



స్పెషల్‌ శానిటేషన్‌ డ్రైవ్‌లో కమిషనర్‌ శైలజ

బోడుప్పల్‌: చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందజేసి ప్రతి ఒక్కరూ స్వచ్ఛ బోడుప్పల్‌కు సహకరించాలని కమిషనర్‌ శైలజ అన్నారు. సోమవారం చేపట్టిన స్పెషల్‌ శానిటేషన్‌ డ్రైవ్‌ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై భారీ జరిమానాతో పాటు క్రిమినల్‌ చర్యలు తీసుకుంటామన్నారు. బోడుప్పల్‌లో చెత్త పారవేసే ప్రాంతాలను గుర్తించి తక్షణం స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామన్నారు. 7వ డివిజన్‌లో శివాలయం రోడ్డు ఆవరణలో చెత్తను తొలగించినట్లు వివరించారు. ప్రతి ఒక్క ఇంటి యజమాని స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించాలని ఆమె కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత తదితరులున్నారు.

కిషన్‌ ప్రసాద్‌ కాలనీ సమస్యలు పరిష్కరించండి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కిషన్‌ప్రసాద్‌ కాలనీవాసులు

అల్వాల్‌: కిషన్‌ ప్రసాద్‌ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు అన్నారు. ఈ మేరకు సోమవారం అల్వాల్‌ సర్కిల్‌ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు పాడైపోయాయని, విద్యుత్‌ దీపాలు పనిచేయడం లేవని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్‌, శివకుమార్‌, రాజ్‌కుమార్‌, సునీల్‌, లోకేష్‌, బాలరాజు, రాంచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

విన్నవించుకున్నా వినరా..?



రోడ్డు పక్కన విచ్చలవిడిగా వ్యర్థాల పారబోత

- ఓ వైపు అవగాహన, మరోవైపు పారబోత
- చెత్త వేయకూడదని వేడుకుంటున్న స్వచ్ఛ కార్మికులు

ప్రజలు విచ్చలవిడిగా చెత్త పారబోతకు మున్సిపల్‌ అధికారుల నిర్లక్ష్యం ఓ కారణమంటూ.. పలువురు అభిప్రాయపడుతున్నారు. వార్డుల్లో ప్రజల ఇళ్ల వద్దకు దుకాణాల వద్ద చెత్త సేకరణ వాహనాలు నిత్యం వెళ్లకపోవడం వల్ల వారు తమ ఇళ్లు, దుకాణాల్లోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేస్తున్నారు. ఉదయాన్నే స్వచ్ఛ వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చి చెత్త సేకరించకపోవడంతో ఇళ్లలోని చెత్తను వారు కవర్లలో వేసి విధులకు వెళ్లే సమయాల్లో రోడ్డుపక్కన, ఖాళీ స్థలాల్లో వేసి వెళ్తున్నారు. మున్సిపల్‌ అధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుని స్వచ్ఛ మేడ్చల్‌గా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

మేడ్చల్‌రూరల్‌: మున్సిపాలిటీ పరిధిలో ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు పక్కన, కాలనీలు ఖాళీ స్థలాలు, చెరువుల సమీపంలో ప్రజలు చెత్తను పారవేస్తుండటంతో ఆ ప్రాంతాలు, రోడ్డుపై వెళ్లే వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే పారబోత..

ముఖ్యంగా మాంసం విక్రయదారులు, దుకాణదారులు తమ దుకాణాల్లో చెత్తను కవర్లు, బ్యాగుల్లో నింపి రాత్రి వేళల్లో రోడ్డు పక్కన పారవేస్తున్నారు. మరోవైపు పలు కాలనీలు, మున్సిపల్‌ పరిధిలోని గ్రామాల్లో నివాసం ఉండే ఇతర ప్రాంతాలకు చెందిన వారు తమ ఇళ్లలోని చెత్తను పనులకు వెళ్లే సమయాల్లో ఖాళీ ప్రదేశాలు, రోడ్డు పక్కన పారవేసి వెళ్తున్నారు.

విన్నవించుకున్నా వినడం లేదు..

మున్సిపల్‌ పరిధిలోని పూడూర్‌ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాల్లో

నిర్లక్ష్యం కూడా కారణమే...

చెత్తను పారవేయకూడదని, పలు మార్లు వినూత్నంగా విన్నవించుకున్నారు. గ్రామం నుంచి పూడూర్‌ చౌరస్తాకు వెళ్లే రోడ్డులో చెత్త వేసే ప్రదేశాల్లో ముగ్గులు వేయడం.. 'దయచేసి చెత్త వెయ్యకండి'.. అంటూ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి విన్నవించుకున్నారు. కానీ వారి విన్నపాలను పెడ చెవిన పెట్టడమే కాకుండా కొందరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

☛ పట్టణంలోని పలు కాలనీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. మేడ్చల్‌ – కిష్టాపూర్‌ రోడ్డులో వాగు వద్ద చికెన్‌షాప్‌ నిర్వాహకులు, ఇతర దుకాణదారులు విచ్చలవిడిగా వ్యర్థాలు వాగులో వేసి వెళ్తున్నారు. చెత్త పారబోతపై సాక్షి కథనాలు ప్రచురించడంతో మున్సిపల్‌ అధికారులు చెత్తవేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డు పెట్టింది. దీంతో చెత్త వేసే వారు ఆ ప్రదేశంలో వేయకుండా నేరుగా వాగు నీటిలో వేస్తున్నారు.

జరిమానాలు విధిస్తున్నాం..

రోడ్డు పక్కన వ్యర్థాలు పారవేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే పలువురికి జరిమానాలు విధించాం. చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజు ఇళ్ల వద్దకు వెళ్తున్నాయి. సమస్య పరిష్కారానికి మరిన్ని చర్యలు చేపడతాం. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛత వైపు అడుగేయాలి.

– చంద్రప్రకాశ్‌, మేడ్చల్‌ కమిషనర్‌



ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటు



ప్రభుత్వ భూమి చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీష

కాప్రా: జమ్మిగడ్డలోని సర్వేనంబర్‌ 376లో ప్రభుత్వ స్థలంగా గుర్తించిన 12 గుంటల భూమి చుట్టూ సోమవారం రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్‌ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాప్రా మండల తహసీల్దార్‌ సుచరిత మాట్లాడుతూ..సర్వేనంబర్‌ 376లో 17.30 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో జై జవాన్‌ కాలనీలో మాజీ సైనికుల కోసం స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలం పక్కనే 199 సర్వే నంబర్‌ ఉందని ఆ నంబర్‌ పేరుతో 376లోని భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై తాము సర్వే చేయించి 12 గుంటల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్‌ వేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులకు నోటీసులిచ్చామని, సదరు నోటీలుకు వారు ఇచ్చే వివరణ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తామని కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి అన్నారు. తమ డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. లావణీ పట్టా పేరుతో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, జమ్మిగడ్డ మారుతీ నగర్‌లో 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అక్కడ డూప్లెక్స్‌ ఇళ్లు నిర్మించారని, ప్రస్తుతం మిగిలింది 12 గుంటలేనన్నారు. ఇప్పటికైనా మిగిలిన భూమిని కాపాడేందుకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

శ్రీనివాస్‌ నగర్‌ కాలనీ అధ్యక్షుడిగా సత్యనారాయణ



శ్రీనివాస్‌నగర్‌ కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులు

కాప్రా: ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌ శ్రీనివాస్‌ నగర్‌ కాలనీ ఎన్నికలు సోమవారం హోరాహోరీగా జరిగాయి. నువ్వా, నేనా అన్నట్లుగా జరిగిన అధ్యక్ష ఎన్నికలో వీఎస్‌ఎన్‌ సత్యనారాయణ 69 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా సీహెచ్‌ రాజిరెడ్డి, జి. రమేష్‌, ప్రధాన కార్యదర్శిగా సద్గుణ చారి, సంయుక్త కార్యదర్శిగా కె. చంద్రారెడ్డి, ఎం శిశిధర్‌రావు, బి. నర్సింహారెడ్డి, కోశాధికారిగా సీహెచ్‌ కృష్ణారెడ్డి గెలుపొందారు. నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులను స్థానిక కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీషసోమశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ శిరీష సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. శ్రీనివాస్‌నగర్‌ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ..కాలనీ సంక్షేమానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా గెలిపించినందుకు కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్‌ రహదారి విస్తరణ తగ్గించాలి

అల్వాల్‌: రాజీవ్‌ రహదారి రోడ్డు విస్తరణ తగ్గించాలని రోడ్డుకు ఇరువైపులా ఆస్తులు కోల్పోతున్న బాధితులు అన్నారు. ఈ మేరకు సోమవారం లోతుకుంట నుంచి అల్వాల్‌ తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్‌ రహదారిపై నిర్మిస్తున్న ఎలివేటెడ్‌ కారిడార్‌ను 200 అడుగుల నుండి 120 అడుగుల వరకు కుదించాలన్నారు. రైతు బజార్‌ సమీపంలోని బ్రిడ్జి రోడ్డును తెలంగాణ తల్లి నుంచి నేరుగా నిర్మించాలని దీంతో జీవిరెడ్డి కాలనీ వారికి ఉపశమనం కలుగుతుందన్నారు. రోడ్డు విస్తరణ తగ్గిస్తే అనేక మందికి ఊరట లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజీవ్‌ రహదారి ప్రాపర్టీస్‌ ఓనర్స్‌ జేఏసీ ప్రతినిధులు తేలుకుంట సతీష్‌గుప్తా, డాక్టర్‌ సుధాకర్‌, రాఘవేంద్ర, సూర్యప్రకాష్‌రెడ్డి, భాషా, కృష్ణారెడ్డి, కమలయ్య, ధనలక్ష్మీ, సచిన్‌, అనురాధ, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కీసర: నాగారం మున్సిపల్‌ పరిధిలోని మారుతి గార్డెన్‌లో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన సాధనమన్నారు. మున్సిపల్‌ మేనేజర్‌ నారాయణ రెడ్డి, డీఈఈ సంతోష్‌కుమార్‌, రెవెన్యూ ఆఫీసర్‌ నాగేశ్వర్‌రావు, సురేష్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ సాయిరాజ్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ బాబు, ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజినీర్‌ శ్రవణ్‌కుమార్‌, నిఖిలేశ్వర్‌, ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో...

మున్సిపల్‌ కార్యాలయంలో సోమవారం సమాచార హక్కు చట్టం వారోత్సవాలు నిర్వహించారు. కమిషనర్‌ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పెంచుకుని, ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందడంతో పాటు ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్నారు. మేనేజర్‌ వెంకటేశం, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఐఐసీటీ స్టాఫ్‌ క్లబ్‌లో కళా సిల్క్స్‌ వస్త్ర ప్రదర్శన



లాలాపేట: తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్‌ క్లబ్‌లో కళా సిల్క్స్‌ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాలైన చీరలు, చేనేత వస్త్రాలు, మహిళలు, పురుషులకు డ్రెస్‌ మెటీరియల్స్‌, రెడిమేడ్‌ దుస్తులు, దీపావళి వేడుకకు కావాల్సిన కళా ఖండాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వికాస్‌ జైన్‌ తెలియజేశారు. దీపావళీ పండుగను పురస్కరించుకుని అన్ని వస్త్రాలపై 65 శాతం వరకు డిస్కౌంట్‌ సేల్స్‌ అందజేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శన నవంబర్‌ 3 వరకు కొనసాగుతుందన్నారు.

అల్వాల్‌ డీసీపై విచారణ చేపట్టండి

ప్రజావాణిలో బీజేపీ నేతల ఫిర్యాదు

అల్వాల్‌: అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న జీహెచ్‌ఎంసీ అల్వాల్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు మురళీకృష్ణ మాట్లాడుతూ అల్వాల్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ఇటీవల జరిగిన పలు అనుమతుల్లో అవకతవకలు జరిగాయని ఈ విషయమై ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని కోరామన్నారు.

15 వరకు ఇంటింటా పోలియో చుక్కల పంపిణీ



డాక్టర్‌ రమాదేవి

కాప్రా: ఈ నెల 15 వరకు కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటా పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ రమాదేవి తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఇప్పటికే దాదాపు 96శాతం పూర్తయ్యిందని, మిగిలిన చిన్నారులకు ఇంటికి వెళ్లి పోలియో చుక్కలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

బోడుప్పల్‌: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన సోమవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బొల్లిగూడెంలో గోగు దామోదర్‌, రవళిక(32) దంపతులు నివాసంఉంటున్నారు. రవళిక తరుచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఈనెల 1న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి లోనైన రవళిక ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఆమె భర్త దామోదర్‌ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

రామంతాపూర్‌: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని కార్పొరేటర్‌ కక్కిరేణి చేతన హరీష్‌ అన్నారు. ఈ మేరకు సోమవారం హబ్సిగూడ డివిజన్‌ పరిధిలోని గోకుల్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్లపై అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతిరోజు సంక్షేమ సంఘాల నేతలు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సాయి కిరణ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌ రాథోడ్‌, బీజేపీ సీనియర్‌ నేత ఎల్లాచారితో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కురుమానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్‌

ఉప్పల్‌: ఉప్పల్‌ డివిజన్‌ ఉప్పల్‌ హిల్స్‌ కాలనీలో రూ.55 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన నాలా నిర్మాణంతో మురుగు నీటి సమస్య పరిష్కారమవుతుందని కార్పొరేటర్‌ మందుముల రజిత పరమేశ్వర్‌ రెడ్డి అన్నారు. సోమవారం ఆమె డివిజన్‌ పరిధిలోని ఉప్పల్‌ హిల్స్‌,లక్ష్మీనర్సింహ కాలనీ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఉప్పల్‌ శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని ఇప్పటికే ఉప్పల్‌ నల్ల చెరువు అభివృద్ధి, సుందరీకరణకు రూ. 27 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ వినీల్‌ గౌడ్‌, కాంగ్రెస్‌ ఉప్పల్‌ నియోజకవర్గ ఇన్‌ చార్జి పరమేశ్వర్‌ రెడ్డి, ఏతు రాజ్‌కుమార్‌, స్థానికులు సల్లా ప్రభాకర్‌ రెడ్డి, రామచందర్‌, ఈగ ఆంజనేయులు, కుమార్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశా

మల్లాపూర్‌: మల్లాపూర్‌ నాగలక్ష్మీనగర్‌ కాలనీ అభివృద్ధి 18 ఏళ్లుగా తాను ఎంతగానో కృషి చేశానని కాలనీ అధ్యక్షుడు పీజీ సుదర్శన్‌ అన్నారు. సోమవారం ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు అనంతరాములు, సలహాదారుడు సీహెచ్‌ శ్రీనివాస్‌లను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. త్వరలో నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోట నవీన్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న దృశ్యం

చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో సైకిల్‌ పెట్రోలింగ్‌



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుషాయిగూడ: చర్లపల్లి పోలీసులు సోమవారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో సైకిల్‌ పెట్రోలింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు డయల్‌ 100, సైబర్‌ క్రైం 1930 తో పాటుగా యాంటీ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన పెరిగుతుందని ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బోడుప్పల్‌: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కార్ల్‌ బ్యాడ్మింటన్‌ అకాడమీ నిర్వాహకులు మూలే మధుసూదన్‌, అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పీర్జాదిగూడలో జరిగిన బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన వారు విజేతలకు బహుమతు లు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో ప్రొఫెషనల్‌ టీం, అడ్వాన్స్‌డ్‌ టీంలు పాల్గొనగా విజేత టీంలకు కప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ పొందాలన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలను అందజేస్తుందన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

చంద్రశేఖర్‌ కుటుంబానికి అండగా ఉంటాం



చంద్రశేఖర్‌ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మధుయాష్కీగౌడ్‌

ఎల్‌బీనగర్‌: అమెరికాలో దుండగుల కాల్పులలో మృతి చెందిన ఎల్‌బీనగర్‌ బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్‌ కుటుంబాన్ని సోమవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీ గౌడ్‌ పరామర్శించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్‌ మాట్లాడుతూ..ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన చంద్రశేఖర్‌ మృతి వారి కుటుంబ సభ్యులకు భరించలేని విషాధమని గన్‌ కల్చర్‌ అమెరికాలో రోజురోజుకు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన పెట్రోల్‌ బంక్‌ సీసీ కెమెరా రికార్డులను సేకరించి దర్యాప్తు పూర్తి చేయాలని అక్కడి అధికారులను కోరినట్లు తెలిపారు.చంద్రశేఖర్‌ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతా నాయక్‌, మార్కెట్‌ కమిటీ డైరక్టర్‌ భాషా అశోక్‌గౌడ్‌, నేలపాటి రామారావు, నాయకులు పార్వతి , గణేశ్‌ రెడ్డి, వినయ్‌ పటేల్‌, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , డేరింగుల కృష్ణ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225470 9912220571